# నేను నేరం చేసానా?

(ఆంధ్రప్రభ, 1-3-78)

---

స్త్రీ శీలానికి ప్రాముఖ్యత నిస్తోంది మన భారతీయ సంప్రదాయం. అదే భారతీయుడు ఆ శీలాన్ని రక్షించక కబళిస్తుంటే మనది గొప్ప సంస్కృతి అని చెప్పుకోవడంలో అర్థంలేదు.

—జయప్రద

---

"మీరు- మీరు.... నిశ్శబ్దంగా నాది తప్పంటున్నారా?"

"..........."

"కేవలం మలినమయింది నా శరీరం మాత్రమే. నా మనస్సు.... ఎప్పుడూ.... అదెప్పుడూ మీదేనని మీకు తెలీదూ?"

"..........."

"మాట్లాడండి. ఒక్కసారి- ఒక్కసారి 'కరుణా! ఇందులో నీ తప్పేం లేదని అనండి!"

"..........."

"ఇది అన్యాయం....నీ కోరిక చాలా దారుణం నేను వివాహితని. నన్నమితంగా ప్రేమించే భర్త నాకున్నాడు"

"కూర్చో కరుణా! నీకు భర్త ఉన్నాడు. నిన్ను అమితంగా ప్రేమించే భర్త నీకున్నాడు నాకు తెలుసు. నన్నూ అమితంగా ప్రేమించే భార్య నాకూ వుంది. కానీ కరుణా నువ్వు నాకు కావాలి"

హఠాత్తుగా తను కోరిన కోర్కెతో చటుక్కున లేచి నిలబడ్డ చిన్ననాటి స్నేహితురాలి వంక చిరునవ్వుతో చూస్తూ నిదానంగా చెప్పాడు గోపాల్.

"నువ్వు.... నువ్వు.... ఇంత క్రూరుడవా?" జుగుప్సగా చూచింది కరుణ.

"నేను పుట్టినప్పుడు క్రూరుణ్ని కాదు కరుణా! నువ్వు నన్ను క్రూరుణ్ని చేశావు."

"నేనా?" దిగ్భ్రాంతితో గోపాల్ వేపు తిరిగిందామె.

"ఆఁ.... నేను నిన్ను ప్రేమించాను....నీ భర్తకంటే అమితంగా ప్రేమించాను. కానీ, కానీ....నువ్వు నన్ను మోసం చేశావు" అంతవరకు అతి శాంతంగా ఉన్న అతని గొంతు ఆవేశాన్ని నింపుకుంది.

"నేను.... నిన్ను మోసం చేశానా?" గొణుగుతూ అక్కడే అంత వరకు తను కూర్చున్న కుర్చీలో కూలబడింది కరుణ.

"మోసం చేయలేదా? నాతో స్నేహంగా ఉంటూ, చెప్పా చెయ్య కుండా ఆ వెధవను పెళ్ళి చేసుకుని వెళ్ళిపోలేదూ? నా ప్రేమని కాదనీ, నన్ను కాదనీ...." అతను ఆవేశంతో ఊగిపోతున్నాడు.

"నువ్వు నన్ను ప్రేమించావా?" మరలా గొణిగిందామె. అతను విసురుగా తలూపాడు.

"మరయితే నాతో ఎందుకు చెప్పలేదు?"

"చెప్పంటే ఏం చేసుండే దానివి?" అతని మాటల్లో కరుకుదనం ఇంకా తగ్గలేదు.

అంతవరకు నీరసంగా కుర్చీలో ఒక పక్కకు వాలి ఉన్న ఆమె ముందుకు వంగి, ఒకనాటి తన స్నేహితుడి కళ్ళల్లోకి సూటిగా చూస్తూ స్థిరంగా చెప్పింది.

"నిన్ను పెళ్ళి చేసుకుని ఉండొచ్చు."

"కరుణా!"

"నిజమే చెబుతున్నాను. ఆ రోజుల్లో పసితనం వదలని ఆ ప్రాయంలో ప్రేమ అంటే నాకేమీ తెలీదు. పైగా ఆ రోజుల్లో నీ మీద స్నేహభావమే కాని ఆయిష్టం ఏమీలేదు. కాని గోపీ, నేనిప్పుడు ఒక బిడ్డకు తల్లినికూడా. మనమిప్పుడు ఇలాటి మాటలు మాట్లాడుకోవడం" ఆమె ఆగింది.

అతను కాసేపటివరకు మాట్లాడలేకపోయాడు.

"తను అడిగుంటే....కరుణ ఒప్పుకునేది....అంటే....అంటే.... తను ప్రేమించిన కరుణ తనభార్య అయి ఉండేదా?"

'ఎంత మూర్ఖుడు తను!' ఎంత తపస్సు చేస్తే ఆ కాలం మరలా తనకు తిరిగొస్తుంది!

క్షణం తీయటి గతంలోకి వెళ్ళి తన పొరపాటుకు చింతిస్తూ నిలిచిపోయిన అతని మనస్సు, ఈ పదేళ్ళుగా నింపుకున్న క్రూరత్వం లోకి, వైచిత్ర్యంలోకి మరలా జారిపోయింది.

"ఓహ్....నువ్వు బిడ్డ తల్లివి కదూ! ఫరవాలేదు. ఆ సంగతు లన్నీ నేను క్షణంపాటు మర్చిపోతాను. నువ్వు మాత్రం నాకు కావాలి కరుణా!"

కంపరంగా చూచింది కరుణ. ఆమె చేతులు తన భుజంమీద నిద్రపోతున్న బిడ్డమీద బిగుసుకున్నాయి.

"రా, కరుణా! నీకొరకు, నీ స్పర్శకొరకు ఈ పదేళ్ళుగా ఎలా ఎదురుచూశానో తెలుసా?"

బిడ్డ నలాగే పట్టుకుని, లేచి నిలబడింది కరుణ

"లేవకు....లేవకు కరుణా! కూర్చో" ఆమె విరహంగా చూచింది.

"నీమాటలు ఈరోజు ఇలా వింటుంటే, చిన్నప్పుడు నీతో కలిసి ఆడుకున్నందుకు ఇప్పుడు నా ఒళ్ళు జుగుప్సతో జలదరిస్తోంది" ఆమె తలుపువైపుగా నాలుగడుగులు వేసింది.

"ఆగు కరుణా! నా సంగతి నీకింకా తెలీదు. నాకు కావాల్సింది నాకు అందేవరకు ఏమైనా చేస్తాను లేదా నా డబ్బు చేస్తుంది"

"అంటే...." అతని కంఠంలో మార్పుకు ఉలిక్కిపడి వెనక్కి తిరిగింది.

"అంటే....నువ్వు నాకు అందందే నిన్ను పోనిచ్చేది లేదు" అతను లేచి, నిదానంగా ఆ మాట అంటూ ఆమె కెదురుగా నడిచి వచ్చేసాడు.

చివ్వున తలెత్తింది కరుణ అతని ముఖంలోకి నిశితంగా, భయంగా చూచింది

తను వింటున్నది నిజమేనా? తన చిన్ననాటి స్నేహితుడు, బువ్వాటలాడుకున్న ఆ పసివాడు ఇంతవాడై, ఎదురుగా నిల్చుని కత్తితో చీలుస్తున్నట్టంటున్న ఈ మాటలు నిజమేనా? ఇది కల కాదు... కదా!

"నిజమే....ఇది కల కాదు...." అని ఆమెకు ఎదురుగా నిర్లక్ష్యంగా నిల్చున్న గోపాల్, నిశ్శబ్దంగా వున్న ఆ పరాయి ఇల్లు చెబుతున్నాయి

"చూడు కరుణా! నీ ముందు నిలబడి నిన్నర్థించాల్సిన పని నాకు లేదు. నా బలం ముందు నీ బలం ఎందుకూ పనికిరాదని తెలుసు...." అతను ఆగాడు

ఆమె ఆలోచిస్తోంది.

'నిజమే....ఈ నిశ్శబ్దంలో, ఈ ఒంటరితనంలో.... సినిమాలో లాగ అతనేమయినా చేయచ్చు' ఆమె చుట్టూ చూచింది. ఆ ఇల్లు నిశ్శబ్దంగా, అరచినా ఎవరూ పలకలేనంత విశాలంగా ఉంది. కానీ సినిమాల్లో లాగ అతనికి కండలు తిరిగిన అనుచరులు లేరు. భూగృహాలు లేవు.

కానీ ఒక్కటిమాత్రం నిజం. అతనికి ఎవరూ లేకపోయినా, అతనొక్కడే చాలు... ఎదిరించే శారీర శక్తి తనలో లేదు.

అతను ఆమెకు ఆలోచించడానికన్నట్టు క్షణం వ్యవధి ఇచ్చి మరలా మొదలెట్టాడు.

"కానీ, కరుణా! బలవంతంగా నిన్ను మాత్రం అనుభవించడం నాకిష్టం లేదు....రా"

ఆమె ఆశగా చూసింది.

"గోపీ! నీకు డబ్బుంది. ఆ డబ్బుకొరకు నీకు అందుబాటులోకి రావడానికి బజారులో చాలామంది స్త్రీలున్నారు. నన్ను....నన్ను వది లెయ్...."

అతను నవ్వాడు.

"నిన్ను వెళ్ళనివ్వకుండా నిన్ను నమ్మించి ఇక్కడకు పిలుచు కొచ్చింది?"

ఆమెకు అతను నవ్వే తీరులో సర్వం అర్థమయిపోయింది. అతను తనని ప్రేమించాడు-ప్రేమిస్తున్నాడు. కానీ ఆ ప్రేమలో ప్రేమిం చిన వాళ్ళ మనస్సు నొప్పించకూడదనే అపురూపమైన ఔన్నత్యంలేదు. అది ఏ దారైనా సరే ఆ ప్రేమను అనుభవించాలనే నైచ్యమైన స్వార్థ ముంది.

తనిప్పుడు అర్థించినా, కరుణించే మానవత్వపు అఖరిమెట్టు నుండి అతను ఎప్పుడో జారిపోయాడని ఆమెకు అర్థమయిపోయింది.

కానీ, ఎలాగోలా బయటపడాలి. తనను తాను రక్షించుకోవాలి. ఎలా?

ముఖద్వారానికి అడ్డంగా అతను....ఆమె చలించే కళ్ళతో అటూ ఇటూ చూచింది. ఒకమూలగా ఏదో వాకిలి. చిన్న ఆశ. అది తనను బయటకు నెట్టే ద్వారం కాకపోయినా సరే....అందులోకి వెళ్ళి తలుపులేసుకుంటే....ఆ తరవాత దొర్లేకాలం తనను రక్షించకపోదు.

చటుక్కున వెనక్కు తిరగబోయిన ఆమె చేతిలోబిడ్డను, ఆమె ప్రతిఘటించే లోపలే లాక్కున్నాడు గోపాల్.

"గోపీ!" ఆత్రంగా చేతులు చాపిందామె. అతను విరగబడి నవ్వాడు.

"చెప్పానుగా, కరుణా! చీరా, సారే పెట్టి పంపడానికి నిన్నిక్కడికి తీసుకురాలేదు నేను-ఇప్పుడూ అంతే. తిరిగి ఇవ్వడానికి నేనీ బిడ్డను తీసుకోలేదు"

"అంటే...." ఆమె ఒంట్లో శక్తినంతా ఎవరో లాక్కున్నట్టు అక్కడే నేలమీద చతికిలబడింది కరుణ.

"నీకీ బిడ్డే కావాలో, నీ శీలమే కావాలో తేల్చుకో"

"గోపీ!" ఆమె జీరబోయిన గొంతుతో అరుస్తూ, ఒక అరచెయ్యి నేలమీద ఆనించి, అతి కష్టంమీద లేచి నిల్చుంది.

"అరిచి లాభంలేదు కరుణా! ఆలోచించుకో"

ఆమె కింక ఆలోచించే శక్తి మిగల్లేదు. ఈ గందరగోళానికి పాప లేచి, ఏడవడం ప్రారంభించింది. చేతులు చాచింది కరుణ. ఆ చాచిన చేతుల్లోకి దూకబోయిన పాపను వారించాడు గోపాల్.

"ఉండు పాపా! నీకు మంచి పాలిస్తాను" అంటూనే టేబుల్ దగ్గరకు నడిచాడు. తనకొరకు, తన నౌఖరు పెట్టిపోయిన పాలగ్లాసుమీది మూతతీసి చప్పుడయ్యేలా దానిని బల్లమీద పడేసి, పాలగ్లాసుతో షోకేస్ వైపు నడిచాడు. ఏదో గుర్తొచ్చినట్టు పాలగ్లాసు మరలా టీపాయ్ మీదుంచి, జేబులో చెయ్యిపెట్టి తాళంచెవి తీసి మెయిన్ తలుపు తాళం వేసేసి, మరలా ఆ తాళాన్ని జేబులో వేసుకుని, గర్వంగా కరుణవైపు చూశాడు.

ఆమె వెర్రిదానిలా అతనినీ, అతని చేతిలోని తన బిడ్డనూ చూస్తూంది. ఆమెకు అయోమయంగా ఉంది. సినిమా చూస్తున్నట్టుంది.

అతను మరలా షోకేస్ వైపు నడిచాడు. అందులోనుండి ఒక సీసా తీసి, పాప నెత్తుకున్న చేత్తోనే దానిని పట్టుకున్నాడు. కరుణ కెదురుగా వచ్చి నిల్చున్నాడు.

"ఇదేమిటి?" ఆమె ఆ సీసామీద అంటించి వున్న లేబిల్ వైపు చూసింది. అది సీల్ తీయని గార్డినాల్ మాత్రల సీసా అందులో బహుశా అయిదువందల మాత్రలుండొచ్చు.

అతను సీల్ విప్పాడు. కాస్త వంచి అన్నిమాత్రలూ పాలలో వేసేశాడు. కొత్తా పాతా ఇంకా తెలియని ఆ ఏడునెలల పసిపాప తన ఏడుపు ఆపేసి అతనినే చిత్రంగా చూస్తోంది.

మెల్లిగా స్పూన్‌తో పాలు కలుపుతూ, కొద్దిగా తలెత్తి, సూటిగా కరుణ కళ్ళల్లోకి చూస్తూ నిదానంగా అన్నాడు గోపాల్.

"చూడు కరుణా! ఈ పాలిప్పుడు నీ పాపకు తాగిస్తే ఏమవుతుందంటావ్?"

బెదిరిపోయింది కరుణ.

"వద్దు....వద్దు....గోపీ" అరవాలనుకున్న ఆమె కంఠంరుద్ధమయి పోయింది.

"గోపీ! మనిద్దరం స్నేహితులం....పసితనంనుండీ ఆడుకున్నాం చదువుకున్నాం....చేతులు జోడిస్తున్నాను. నా బిడ్డను నాకిచ్చెయ్" ప్రతి మాలింది.

"ఇస్తాను కరుణా! ఇస్తాను. కాని నేనడిగింది నాకివ్వు"

"ఛీ దుర్మార్గుడా!"

"అయితే తాగించేస్తున్నా" అతను సవాల్ చేస్తున్నాడు.

"గోపీ! ఇది న్యాయంకాదు! నువ్వు కోరాలే కాని నాకంటే అందమైన అమ్మాయిలెంతోమంది నీ కాళ్ళకిందకొస్తారు. నన్ను....నన్ను.... వదిలెయ్ గోపీ" ఆమె దాదాపు ఏడుస్తూంది.

"ఇదుగో! ఇలాంటి కబుర్లే నాకిష్టంలేంది. తొందరగా తేల్చు. నీ పాప కూడా పాలు తాగాలని తొందరపడుతోంది"

నిజమే! తన తల్లి శీలం తాలూకు సమస్య తనది కాదన్నట్లుగా, ఆ నూతన వ్యక్తి చంకలో చేరి, అతని చేతిలోని గ్లాసు వంక మిలమిల మెరిసే కళ్ళతో చూస్తోంది పాప.

బహుశా, సీసా పాలే అలవాటైన ఆ ఏడునెలల పాప ఆ గ్లాసులోని ద్రవం క్రొత్తరకం పదార్థమని ఆశపడుతూ వుండచ్చు.

'భగవంతుడా నువ్వున్నావా?' ఆమె మనసులో వెయ్యి కంఠాలు హాహాకారాలు చేస్తున్నాయి.

పాలగ్లాసు పాప పెదాలకు ఇంచుమించు అందుబాటులోకి వచ్చేసింది.

పాప తన చిన్న పల్చటి నాలుకను బయటకు చాపి, ఆ గ్లాసులోని ద్రవాన్ని అందుకోవాలని ప్రయత్నిస్తోంది.

"అగు....అగు...." కంపించిపోయింది కరుణ.

"అయితే నువ్వు ఒప్పుకున్నట్లేనా?"

ఆ ప్రశ్న వినిపించుకోలేదామె.

"అమ్మా అన్ని మాత్రలను తన కడుపులో దాచుకున్న ఆ పాలలోని ఒక్కచుక్క... ఒక్క చుక్క చాలదూ తన బిడ్డను తనకు శాశ్వతంగా దూరం చేయడానికి...."

తన పాప నోటి దగ్గర పాలగ్లాసు విసిరేయటానికి చెయ్యెత్తి, చటుక్కున ముందుకొచ్చిన కరుణను గమనించి, ఒక్క అడుగు వెనక్కేసి విసుగ్గా చూసాడు గోపాల్.

"ఈ వేషాలు నా దగ్గర కాదు! తొందరగా తేల్చి చెప్పు. నేనెవర్నీ ఇంతవరకు ఇంతలా బ్రతిమాలుకోలేదు"

లేని ధైర్యాన్ని కూడదీసుకుంటూ అంది కరుణ....

"నేను ఇందుకు ఒప్పుకోను-చావనైనా చస్తానుగానీ...."

"నువ్వు చావవు కరుణా నీ బిడ్డ చస్తుంది"

చటుక్కున ఆమె చూపులు బిడ్డవైపు తిరిగాయి.

ఈ గందరగోళంలో గ్లాసు బిడ్డ నోటినుండి దూరంగా వెళ్ళిపోయింది.

"న్యాయస్థానం వుంది, ఆ తర్వాత నీకు ఉరిశిక్ష పడుతుంది. కనీసం ఒక ఆడదాని కోసం నీ భవిష్యత్తెందుకు పాడుచేసుకుంటావు?

నీ చిన్ననాటి స్నేహితురాలిగానైనా నన్ను జాలితలచి వదిలెయ్" ఆమె చేతులు జోడించింది.

అతను విరగబడి నవ్వాడు మరొక్కసారి.

"ఇది సినిమా కాదు నీ మాటలకు కరగిపోవడానికి! ఇది నాకు ఎన్ని సంవత్సరాలకు దొరికిన చాన్సంటే-అమ్మో! దీనిని నేను వదులు కుంటానా....?

ఇకపోతే న్యాయస్థానమా? అది శిక్షించగలిగేది మీలాటి మధ్య తరగతి వాళ్ళనే-మమ్మల్ని శిక్షించటానికి దానికెన్ని గుండెలు కావాలి?" అలా అంటూనే కరుణ దగ్గరగా రెండడుగులు వేసాడు

విషపూరితమైన పాలగ్లాసు అంచును పాప పెదాలకు అంటించాడు.

ఇంకొద్దిగా, ఇంకొక్కరవ్వ ఆ గ్లాసు వంచితే చాలు పాప చిరు పెదాలు, చిగురుటాకువంటి నాలుక అందుకోవటానికి సిద్ధముగా వున్నాయి.

ఆ తర్వాత....ఆ తర్వాత....

"ఇదుగో తాగించేస్తున్నా! ఆ తర్వాత నీ శీలాన్ని భద్రపరచుకుని ఇంటికెళ్ళి ఆనందపడుదువుగాని...."

చప్పున స్పృహలోకి వచ్చినట్టయి వెర్రికేక వేసింది కరుణ.

"వద్దు....వద్దు....ఈ శరీరమేగా నీక్కావలసింది తీసుకో.... నాకు....నాకు....నా బిడ్డ కావాలి. నా పాప కొరకు....నేను ఏమయిపోయినా సరే...."

అతను ఆ తర్వాత క్షణమైనా ఆగలేదు.

పాలగ్లాసు షోకేసులో పెట్టి అద్దం పెట్టేసాడు.

బిడ్డను నేలమీద దించి, నాలుగు బొమ్మలు ముందేసి కరుణ చెయి పట్టుకున్నాడు.

"రా వెళదాం...."

మరబొమ్మలా కదిలింది కరుణ.

★　★　★　★

అతని హేయమైన కౌగిలిలో బలవంతంగా ప్రాణాలు బిగబట్టుకుని నలుగుతోంది కరుణ

బయట గదిలో పాప నిశ్చింతంగా ఆడుకుంటోంది, కేరింతలు కొడుతోంది.

★ ★ ★ ★

"ఇలా....ఇలా ఎందుకు జరిగింది? అతను దారిలో కన్పించి కరుణా! చాలారోజులకు కనిపించావు. మా ఇంటికి రాకూడదూ! నా శ్రీమతిని పరిచయం చేస్తాను!" అన్నప్పుడు ఎంత గుడ్డిగా నమ్మింది తను?

ఆ క్షణం ఎంత పాపిష్టిది?

మరలా....మరలా కొన్ని గంటలకాలం వెనక్కి తిరిగితే.. ఆ వెనుకటి క్షణమే మరలా ఎదురయితే తను ఏదో చెప్పి వెనక్కి వెళ్ళిపోయుంటే, ఆమె మలినమైన శరీరం, నిస్త్రాణమైన మనసుకూడా పశ్చాత్తాపంతో నిండిపోతున్నాయి.

ఆమె తెరచుకున్న కంటి కొసలనుండి రాలే కన్నీరు తలగడను తడిపేస్తోంది

అతను లేచి నిల్చున్నాడు.

ఆమె తలెత్తింది.

ఒక హంతకుడయిన కుష్టువాడిని చూసినట్టు చూసింది.

"ఇప్పుడయినా నీకు పశ్చాత్తాపం కలగడంలేదూ!"

"లేదు"

అతను నాలుగడుగులు వేసి, తలుపు తీయబోయాడు.

"ఆగు....నీ కోరిక తీర్చుకొని, నేనెవరికయినా ఈ విషయం చెప్పి నిన్ను శిక్షిస్తానని భయపడి...."

ఆమెను మధ్యలోనే ఆపేసి నవ్వాడతను.

"ఆ భయం నీకూ, నాకూ కూడా అక్కర్లేదు కరుణా! ఈ పవిత్ర భారతదేశంలో పుట్టిన ఒక అమ్మాయి ఎవరితోనయినా సరే 'నేను శీలం పోగొట్టుకున్నా'నని చెపుతుందని నేననుకోను"

"ఊహుఁ ఊహుఁ! ఈ సంగతి నేను నా భర్తకు చెప్పాలి. చెప్పకుండా ఈ నిప్పులాంటి నిజాన్ని దాచుకుని, బ్రతకలేను" ఆమె మనసు రోదిస్తోంది.

అతను తలుపులు తోసుకొని వెళ్ళి, పాపను తెచ్చి ఆమె ఒడిలో వేసాడు.

.... .... ...

"కేవలం.... కేవలం మలినమైంది నా శరీరం మాత్రమే నా మనస్సు-అదెప్పుడూ మీదేనని మీకు తెలీదూ....!"

.... .... ....

"మాట్లాడండీ! ఒక్కసారి.... ఒక్కసారి.... 'కరుణా! ఇందులో నీ తప్పేంలేదు' అనండీ!"

.... .... ....

"జరిగిందంతా మీకు చెప్పుకున్నాను.... నన్ను.... నన్ను...."

అతను నిశ్శబ్దంగా లేచి వెళ్ళిపోయాడు.

* * * *

"నువ్వు తప్పుచేశావు కరుణా!" తన ఒళ్ళో గువ్వలా ఒదిగిపోయిన బిడ్డ కన్నీళ్ళు, తన కన్నీళ్ళు కూడా ఆవిరయిపోయాక అంది కరుణ తల్లి.

"అమ్మా! నువ్వూ అదే అంటున్నావా?" దెబ్బతిన్న పక్షిలా నిస్సహాయంగా చూసింది కరుణ.

"నువ్వు అనవసరంగా భయపడి అతనికి లొంగిపోయావు. నువ్వు ఒప్పుకోకపోయినా ఊరికే బెదిరించాడుగానీ, ఆ పాలు నీ బిడ్డకు అతను తాగించి వుండకపోను."

"అమ్మా!"

"ఒక్కసారి.... ఒక్కసారి వూహించమ్మా. ఆ పాలు నా పాపకు తాగించి వుంటే...."

ఆమె మాట్లాడలేదు. ఆమె కళ్ళు మరలా సజలాలయ్యాయి. నిట్టూర్చింది కరుణ.

"నిజమేనమ్మా, తప్పంటూ చేసుంటే, నేను నా భర్త ప్రేమను పూర్తిగా విశ్వసించి, నాకు జరిగిన ఘోరం గురించి ఆయనకు చెప్పుకోవడమే...."

"కానీ అమ్మా! అసలు....అసలు ఈ తప్పెవరిది? నా మనసులేని శరీరం కొరకు నా బిడ్డ ప్రాణాలతో సైతం చెలగాటమాడిన గోపాల్‌దా? తన భార్య ఏ పరిస్థితుల్లో తన శీలాన్ని కోల్పోయిందో గ్రహించుకోలేని నా భర్తదా?

కేవలం శరీరం మలినమవ్వడాన్నే శీలం కోల్పోవడంగా శీలానికి నిర్వచనమిచ్చి, ఆడదాని శీలానికి మాత్రమే అంత విలువ నిచ్చిన ఈ సమాజానిదా?

లేక....లేక....ఆడదానికి మగవాడితో ప్రతిఘటించగలిగే శారీరక శక్తినివ్వని ఆ సృష్టికర్తదా?"

"..............."

అన్యాయమైపోయిన ఆ బిడ్డకు తానేమి జవాబు చెప్పాలి? ఏ ఆశ చూసి బ్రతకమని అర్థించాలి?

తల్లి మనసులోని అసహాయతను అర్థం చేసుకున్న కరుణ తిరిగి అంది:

"కానీ అమ్మా! ఈనాటికీ నేను చేసింది తప్పు అనుకోవడంలేదు. నా బిడ్డ ప్రాణంకంటే నా శీలం విలువ గొప్పదని భావించలేదు"

కరుణతల్లి మాట్లాడలేదు. కానీ ఆమె అంతరాత్మ మాత్రం గొణిగింది.

"నిజమే....నిజమే"

*